# పాపా నీకేం కావాలమ్మా?

**నాదు జన్మభూమి కన్న నాక మెక్కడుందీ అన్నట్లుగా జన్మభూమికి వెళ్లడం అంటే ఏదో అతేంద్రియ శక్తులు శరీరాన్ని ఆవహించినట్లు, మనసూ, శరీరం అవ్యక్తానందంతో తేలిపోతుంటాయి. కన్నతల్లిని చూసినా అంతే. అమ్మ చేసుకున్న పుణ్యం, జన్మభూమి చేసుకున్న పుణ్యం రెండూ ఋణం తీర్చలేనివి.**

గోదావరి పుష్కరాలకు రమ్మని నాకు రాజమండ్రి నుండి ఉత్తరం వచ్చింది. పుట్టి పెరిగిన ఊరు వదిలి ఎన్నో సంవత్సరాలుగా వివిధ ప్రాంతాలలో ఉద్యోగం చేస్తుండటం వలన, ఈ పుష్కరాలు వంకనైనా ఊరు వెళ్లాలనిపించింది. ఆస్థులూ, పాస్థులూ, మడులూ, మాణ్యాలూ, అయినవాళ్లు ఎవరూ లేకపోవడంతో నా కన్నతల్లి గోదారి, జన్మభూమి రాజమండ్రి చాలా దూరం అయిపోయాయి.

విజయవాడకు దగ్గరగా పల్లెటూర్లో ఉన్న నేను ఉదయం పదిన్నరకల్లా విజయవాడ చేరుకున్నాను. పదకొండు గంటలకు బస్సు.

బస్సు వచ్చింది. ఎలాగో కష్టపడి ఇద్దరు కూర్చునే సీటులో భాగాన్ని, కండక్టరు సీటు తరువాత రెండోది సంపాదించుకుని కూర్చున్నాను. నా ముందు సీట్లో ఒక యువ జంట కూర్చున్నారు. అతని వొడిలో ఒక ముద్దులపాప. వయసు సుమారు ఏడెనిమిది నెలలు ఉంటాయి. ఆయన వేషధారణలో నిరాడంబరత కనుపించింది. ఆమె మాత్రం అప్పుడే డ్రెస్సింగ్ టేబుల్ ముందునుండి లేచివచ్చినట్టుంది.

తెల్లని మల్లెపూవు లాంటి చీర. అదే రంగు బ్లౌజు. ఆమె శరీరపు నిగారింపు, కొంపుసొంపుల వయ్యారాలు, ఆమె వివాహితురాలేనా, పిల్ల తల్లేనా అన్నట్లుగా ఉంది చూసేవారికి చూపు మరల్చుకోలేనట్లుగా ఉన్నాయి.

పాపను ఆయనే ఎత్తుకున్నాడు. ఆయన బట్టలు తొక్కుతూ, నవ్వులు చిందిస్తూంది పాప. పసిపాప చిరునవ్వులలో వెన్నెలలు కురుస్తాయి. చందమామను చూసిన అనుభూతి. నేను పాపను తదేకంగా చూస్తున్నాను. మేము బస్సు ఎక్కి పావుగంట అయింది. కండక్టరుగాని, డ్రైవరుగాని రాలేదు. గాలి లేదు. పాప ఏడుస్తుంటే ఆయన పాపను ఓదారుస్తున్నాడు.

ఆమె మాత్రం, హాయిగా సీటులో కూర్చుని పమిట సవరించుకోడం, ముఖానికి పూసుకున్న రంగు చెరిగిపోయిందేమోనని అద్దంలో చూసుకోవడం, చీర సవరించుకోవడం, మెడలో నగలు పరిచేసుకోవడం, బస్సులో జనం తనని చూస్తున్నారా లేదానని పరిశీలించడం ఇదే సరిపోతూంది. తన కూతురు ఏడుస్తూంది అన్న ధోరణి ఆమెకు ఉన్నట్లు నాకు కనిపించలేదు.

కండక్టరు, డ్రైవరు ఎక్కాక బస్ బయలుదేరింది. సమయం పదకొండు అయింది.

బస్సు బయలుదేరి సుమారు గంట అవుతుందేమో హనుమాన్ జంక్షన్ నుంచి బస్ బయలుదేరే సమయం. అప్పటిదాకా ఆడుకుంటున్న పాప ఏడ్వడం మొదలు పెట్టింది. ఆయన దగ్గరనుండి పాప, తల్లి వేపు తిరిగి ఏడుస్తూంది. ఒక పావుగంట అయింది. పాప ఏడుపు తారస్థాయికి చేరుకుంది. ఆయన భార్యతో ఏదో అంటున్నాడు. నాకు ముందు సీటే అవడంతో, బస్ రొదలో మాటలు వినబడకపోయినా, ముందుకు వంగి విన్నాను.

"ఏయ్ దీనికి ఆకలవుతోంది. నోట్లో పెట్టు".

"శని ముం-. దీనికోసం నా అందాన్ని పాడుచేసుకోనా. ఇప్పటికే మీ మాట విని కొన్ని రోజులు పాలు ఇచ్చాను. నా బ్రాలు వదులైపోయాయి. ఇంకేదైనా అడగండి. ఆ విషయం మాత్రం చెప్పద్దు." ఆమె తీవ్రంగా సమాధానం చెప్తోంది.

పాప వెక్కి వెక్కి ఏడుస్తూంది. పాపను చూస్తే జాలివేస్తూంది. వికారంగా ఉంటే నోట్లో వేసుకోవచ్చని నేను కొనుక్కున్న స్వీట్స్ పాపకు ఇచ్చాను. అని విసరికొట్టింది. ఆ పాపను ఏం కావాలో నాకు తెలుసు. బస్సు నడిచే శబ్దంకన్నా పాప ఏడుపు శబ్దం ఎక్కువ అయింది. అందరికీ విసుగ్గా ఉంది.

ఒక పది సంవత్సరాల పాప తమ తినే మోడ్రన్ బ్రెడ్ ఇచ్చింది.

ఒక ముదుసలి బత్తాయి తింటూ నాలుగు తొనలు ఇచ్చింది.

ఒక స్త్రీ లేచి తన సీటులోంచి పాపను ఎత్తుకుని సముదాయించింది -- ఊహూ:

నేను కూడా లేచి పాపను సముదాయించబోయాను -- లేదు. పాప ఊరుకోడం లేదు.

పాప ఊరుకోడం లేదు.

పాప తల్లికి మాత్రం ఇదేమీ పట్టినట్లు లేదు.

తండ్రి సతమతమైపోతున్నాడు.

ఒక ముసలాయనకు మాత్రం ఈ విషయం అంతా చూస్తూ చాలా కోపం వచ్చినట్లుంది. "కలికాలం తల్లీ కన్నకూతురు ఏడుస్తున్నా కరుగని మనస్సు పెడుతున్నాడు ఈ

4572
శ్రీకాకుళం



రోజుల్లో స్త్రీలకు. ఆ పాపకు ఇవేమీ అక్కర్లేదు. తల్లిపాలు కావాలి. ఆ తల్లిని పాలు ఇవ్వమని చెప్పండి" అని లోపల లోపలే సణుక్కుంటున్నాడు.

వెనుక సీటులోంచి "ఆ తల్లి స్వంత తల్లేనా? లేక సవతి తల్లా. ఆమెను పాపకు చనుబాలు ఇవ్వమని చెప్పండి" అని ఒక వ్యక్తి ఆక్రోశించాడు.

ఒక నడి వయస్కుడు "ఏమండి పాప చాలాసేపటినుంచి ఏడుస్తూంది. ఇలా ఏడిస్తే గొంతు పూడుకుపోతుంది. బస్ ఆగినప్పుడు సోడా పట్టించండి" అన్నాడు. అంతటితో ఊరుకోకుండా ఒక పల్లెటూరులో బస్ ఆపి సోడా తీసుకువచ్చాడు. పాప సోడా త్రాగలేదు. తల్లి పాపను కొరకొరా చూస్తోంది.

బస్ కదిలింది. కొంతమంది దిగేరు మళ్లా ఎక్కారు. పాప ఏడుపు ఆగలేదు. పాప గొంతు బొంగురుపోయింది. ఆయనకు చాలా కోపం వచ్చినట్లుంది. పాపను ఆమె ఒడిలో కూర్చోబెట్టి తల పట్టుకుని కూర్చున్నాడు.

నేను కనక ఆయన స్థానంలో ఉంటే పాపకు పాలు ఇవ్వకపోతే ఈపాటికి ఆమెను ఏం చేసేవాడినో.

ఒడిలో కూర్చుని ఏడుస్తున్నా ఆ పాపను ఈ లెంపా ఆ లెంపా వాయించింది. సొమ్మసిల్లి పాప ఆమె ఒడిలో నిదురపోయింది.

"అబ్బ తుఫాను వెలిసినట్లుంది". అనుకున్నాడు.

సాయంత్రం ఐదయింది. కొవ్వూరు దగ్గర పడుతూంది. బస్సుకు అక్కడక్కడ గేదెలు స్పీడ్ బ్రేకర్స్‌లా అడ్డం వస్తున్నాయి. చుట్టూ పచ్చని పంట పొలాలనుండి ఒక రకమైన వింత వస్తూంది. ఒక్కసారి గుండెల నిండా పీల్చాలనిపిస్తోంది. ఒక్కసారి భరించలేనట్లుగా ఉంది. చుట్టూ ఎటుచూసినా, కనుచూపు మేర ఆకు పచ్చని పొలాలు. ప్రకృతి కాంత ఆకుపచ్చని చేనేత చీర కట్టుకుని పరవశంతో నాట్యం చేస్తున్నట్లుగా పొలాల్లో పైర్లు తలలు ఊగిస్తున్నాయి.

ఈ ప్రకృతి సౌందర్యం ఆస్వాదిస్తూ పాప సంగతి మర్చిపోయాను.

పాప తండ్రిని వెనుకనుండి తట్టి "ఏమండి పాప నిద్రపోతూందా" అన్నాను నెమ్మదిగా. ఆయన నన్ను 'వీడెవడ్రా మధ్యలో' అన్నట్లుగా నిశితంగా చూసి ఆమె వొడిలో చూశాడు. ప్రశాంతంగా నిదురపోతూంది. పాపను ఎత్తుకుందామని ఆమె వొడిలోంచి లేవదీయబోయాడు. పాప కాళ్లు చేతులు నిర్జీవంగా వ్రేలాడుతున్నాయి. ఆయనకు ఏం తోచలేదు. నేను ఆయన్ను గమనిస్తున్నాను. పాపను ముట్టుకుని చూశాను. నాడి చాలా నీరసంగా కొట్టుకుంటూంది. తన

తల్లిని దీనంగా చూస్తోంది అరమోడ్పు కన్నులతో.

అందరూ ఈ పరిస్థితి చూసి బస్సును తొందరగా కొవ్వూరు చేర్చమని డ్రైవర్‌కి చెప్పాము. సాధ్యమైనంత తొందరగా కొవ్వూరు చేర్చాడు డ్రైవర్.

పుష్కరాలు పందిళ్ల దగ్గర బస్ ఆపాము. అక్కడున్న డాక్టర్స్ క్యాంప్ దగ్గరకు పాపతో పరుగులతో వెళ్లాము. మా వెనుక పాప తల్లి కూడా వస్తోంది. డాక్టర్లు పాపను చూసి ఒక్క పది నిముషాలు ముందు వస్తే బాగుండేది అన్నారు.

పాపకు ఈ లోకంతో పని తీరిపోయింది. తన అందాలను కాపాడుకోడానికి పాలు ఇవ్వలేని తల్లికి, కూతురుగా ఉండటానికి ఇష్టంలేని పాప శాశ్వతంగా నిద్రపోయింది.

ఇక ఆయన కోపానికి అవధులు లేవు. " రాక్షసి నువ్వే పాపను పొట్టన పెట్టుకున్నావ్ " అన్నట్లుగా ఆమెను తినేసేట్లుగా చూస్తున్నాడు. ఆయన చూపులకు శక్తి ఉంటే ఆమె మసి అవ్వాల్సిందే.

ఆమెను అనేక రకాలుగా విమర్శిస్తున్నారు అందరూ.

నా హృదయమంతా వికలమైపోయింది. రాజమండ్రిలో పుష్కరాలకు హాయిగా గడుపుదామని బయలుదేరితే ఇలా జరిగిందేమిటి?

అందానికి హద్దులేమిటి? ఆ శిల్ప సౌందర్యం ఎన్ని సంవత్సరాలు చెదిరిపోకుండా ఉంటుంది? అయితే ఆ సొగసులు చెదిరిపోకుండా ఉండాలంటే నిత్య జీవితంలో మధురానుభవాలను, బంధాలను త్రెంచి వేసుకోవాలా? అందుకోసం భర్తను ముట్టుకోవద్దనడం, పిల్లలకు పాలివ్వక పోవడం సమంజసమేనా? ఈ అందం శాశ్వతమేనా? ముసలితనంలో ఈ శరీరం మాంసపు సంచులుగా వ్రేలాడకుండా ఉంటుందా ఈ ప్రశ్నలు నన్ను వేధించసాగేయి.

ఆ దంపతులను, నిర్జీవమైన పాపను ఎక్కించుకుని బస్సు బయలుదేరింది ఇంతకు ముందుకన్నా భిన్నంగా పాపను పొదివిపట్టుకుంది ఆమె.

ఇప్పుడు ఏం లాభం?

***